ఆ ఆలోచన వచ్చాక ఇంక స్థిమితంగా ఉండలేక పోయాడు.

★ ★ ★

రోజులు గడుస్తున్నాయి.

ఆ రోజు నిరంజనరావు పార్కు నుంచి వచ్చేస రికి విశాల ముఖం ఆనందంతో వెలిగిపోతోంది.

చాలా రోజుల తరువాత ఆమె నోరు విప్పి మాట్లాడింది.

''మొన్న మీరెళ్లిన డ్వాక్టరుగారు ఆయన ఆఫీస్‌కి ఫోన్ చేశారుట. మీ టెస్టుల తాలూకు రిపోర్టులు మారినట్లు అనుమానంగా ఉందని రమ్మన్నారుట'' అంది ఆయన్ని చూడగానే.

మళ్లీ కొడుకుతో కలిసి డ్వాక్టరు దగ్గరికె ళ్లడం...ఆయన నిరంజనరావుకి ఏ జబ్బూ లేదని తేల్చి చెప్పడం...అంతా కలలోలా జరిగిపోయింది.

ఇలాంటి అద్భుతం జరుగుతుందని కలలో కూడా ఊహించని శ్రీధర్ ఆనందంతో చిన్నపిల్లా డైపోయాడు.

ఆనందంగా ఇంటికొచ్చి విశాలతో చెప్పారు.

మోడువారిపోయిన చెట్టుకి ఆకులు వచ్చినట్లు ఆ ఇంట్లో మళ్లీ మాటలు చిగురించాయి.. నవ్వులు పూసాయి.

సంతోషం కన్నా 'తిరిగి సాధించుకున్న సంతోషం' మరింత గొప్పగా ఉంటుంది...ఆ సంబరంలో అంతా తేలిపోయారు.

నిరంజనరావు హాయిగా ఊపిరి పీల్చుకు న్నాడు.

★ ★ ★

ఆ తర్వాత ఆరు నెలలకే నిరంజనరావు హఠాత్తుగా మరణించాడు.

''కాలం తీరిపోయింది. వెళ్లిపోయాడు'' అనుకున్నారంతా.

పై లోకంలో నిరంజనరావు మాత్రం తృప్తిగా నవ్వుకున్నాడు. డ్వాక్టరుతో తను ఆడించిన చిన్న అబద్ధం తండ్రిని కాపాడుకోలేకపోయానన్న ఆత్మ న్యూనతా భావం నుంచి కొడుకుని జీవితాంతం కాపాడగలిగింది. ఇన్నాళ్లూ ఆనందమయంగా సాగిన తన జీవిత కథని దుఃఖాంతం కాకుండా కాపాడగలిగింది.

-ఆకునూరి మురళీకృష్ణ
(భువనేశ్వర్)

# జాతకం

మృత్యుంజయశాస్త్రిగారి గురించి విన్నది నేను నమ్మలేకపోయాను. ఆయన గొప్ప రచయిత, కవి, నాటక రచయిత. అనేక కథలు, నవలలు రాసి ఆంధ్రదేశమంతా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. కొన్ని కథలకు ప్రముఖ వారపత్రికలు శాస్త్రిగారికి బహుమతులూ ఇచ్చేయి. ఆయన సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉన్నతోద్యోగం చేసి రిటైరయ్యారు. సాధారణంగా సర్వీసులో ఉండగా రచయితలు తమ పూర్తి కాలాన్ని రచనల మీద వినియోగించడానికి కుదరదు. ఆఫీసు పని వత్తిడి దానికి ముఖ్య కారణం. అటువంటి వారు పదవీ విరమణని ఒక వరంగా తీసుకుని తమ పూర్తి కాలాన్ని రచనా వ్యాసంగం మీదకు మళ్లిస్తారు. శాస్త్రిగారి విషయంలోను అందరూ అదే ఆశించారు.

శాస్త్రిగారు రిటైరయ్యాక అందరూ ఊహించినట్టుగా రచనా వ్యాసంగాన్ని చేపట్ట లేదు. మరి ఏం చేస్తారు? ఆయన చిన్నప్పటి నుంచి అనేక శాస్త్రాలను అభ్యసించేరు. వారికి సంస్కృతంలోనూ మంచి పట్టున్నది. మంత్ర శాస్త్రం, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయడం వారికిష్టమైనవే. కానీ వారికి జ్యోతిషశాస్త్రం తెలుసునని చాలామందికి తెలియదు. జ్యోతిష శాస్త్రం తెలియడమే కాదు అందులో వారు చాలా కృషి చేశారని, నిష్ణాతులయ్యారని తర్వాత తర్వాత తెలిసింది.

శాస్త్రిగారు రిటైరయిన మరునాడే వారి ఇంటి కాంపౌండు గోడకి 'దైవజ్ఞ' జె.మృత్యుంజయశాస్త్రి అనే నేమ్‌బోర్డు తగిలించడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. పెళ్లిళ్లకు, గృహప్రవేశాలకు ముహూర్తాలు పెట్టడం, వాస్తు చూడటం, జాతకాలు రాయడం మొదలైనవి అన్నీ చేయడం ప్రారంభించేరు. నేనూ రెండు మూడు సార్లు ఆయన్ని విషయాలపై సంప్రదించేను. మా సంభాషణల్లో జ్యోతిషం మీద వారు చెప్పేవి చాలా ఆసక్తికరంగా ఉండేవి. అడిగేవారి ఇబ్బందులనర్థం చేసుకుని పట్టువిడుపులు ప్రదర్శిస్తూ అందర్నీ తొందర్లోనే ఆకట్టుకున్నారు. అన్నీ ఉచితంగానే చెప్పడం వారి ప్రత్యేకత.

జ్యోతిషంపై కొన్ని పత్రికలకు వ్యాసాలు రాశారు. ప్రతి ఉగాదికి పంచాంగ పఠనం, రెండు మూడు చోట్ల శాస్త్రిగారి ముఖ్య కార్యక్రమం. అలాగే ఈ 'తారణ' నామ సంవత్సరంలోనూ శాస్త్రిగారి పంచాంగ శ్రవణానికి వారు చెప్పే మూడు సంస్థలతోనూ నాకు అనుబంధం ఉన్న దృష్ట్యా మూడుచోట్లకు నేనూ వెళ్లాను.

పంచాంగ శ్రవణంలో కొత్త సంవత్సరంలో సంభవించబోయే దేశ కాల ఫలాలతో పాటు వ్యక్తి జన్మ నక్షత్రానికి అనుగుణంగా రాశిఫలాలు, కందాయఫలాలు మొదలైనవి వివరంగా చెబుతారు. శాస్త్రిగారు ఈసారి చెప్పేరు. కానీ ఈసారి వారు చెప్పిన ఒక విషయం చాలా విచిత్రంగా కనిపించింది. నాకు మేష, వృషభ, మిధున, కర్కాటక, సింహ, కన్య, తుల, వృశ్చిక, ధనుస్సు, మకర, కుంభ, మీన అన్ని రాశులవారికి పూర్తి శుభాలే చేకూరుతాయని చెప్పేరు. ఇది నన్నెంతో ఆశ్చర్యపరచింది. ఎంత ఆలోచించినా దీనికి తగిన సమాధానం నాకు దొరకలేదు.

ఉగాది అయిన నాలుగయిదు రోజులకే శాస్త్రిగారికి తీవ్ర అస్వస్థత కలిగింది. పంచాంగ పఠనంతో అలిసిపోవడం, అనుకున్నది కాక పోగా, కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లాల్సి వచ్చింది. గుండె పోటుగా వాళ్లు నిర్ధారించి ఐ.సి.సి.యు.లో పెట్టారు. ఇది విని అక్కడే వారిని చూసి వచ్చేను. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని మరో పెద్ద హాస్పిటల్‌కు మార్చారు.

మరో పది రోజుల్లో పిడుగులాంటి వార్త తెలిసింది. శాస్త్రిగారు మరి లేరు. సంతాప సభ అయ్యాక జ్యోతిషంలో కొంత ఎక్కువ పరిచయమున్న నా ఫ్రెండుని శాస్త్రిగారి ఈ సంవత్సరపు పంచాంగ పఠనం గురించి అడిగేను. ''కొన్ని రాశులవారికి శుభాలు, మరి కొన్ని రాశులవారికి అశుభాలు ఉంటాయి. కానీ శాస్త్రిగారు ఈసారి అన్ని రాశుల వారికీ శుభపరిణామాలనే చెప్పారు. ఎందువలన?''

''అవును. ఈ విషయం నేనూ విన్నాను'' అని ఊరుకున్నాడు.

''జ్యోతిషశాస్త్రంలో నిష్ణాతులైన శాస్త్రిగారికి తన రాశి దుష్పరిణామాలు తెలియవా?''

''ఎందుకు తెలియవు? తెలుసును.''

''మరి?''

''మీ అనుమానానికి సమాధానం దాదాపు మీరే చెబుతున్నారు''

నా అయోమయం మరింత పెరిగింది. ''నేనడిగేదేమిటి, మీరు చెప్పేదేమిటి?'' కొద్దిగా గద్దించాననే చెప్పాలి.

''అదేనండీ.. మహాశయా! తన రాశి వారికి ఈ సంవత్సరం జరగబోయే దుష్పరిణామాలు, తాను రాహుగ్రస్తుడ్ననీ శాస్త్రిగారికి తెలుసు. కానీ వాటిని ఆయన జీర్ణించుకునే స్థితిలో లేరు. అందుకే పంచాంగ పఠనంలో అన్ని రాశులవారికీ (తనతో సహా) శుభపరిణామాలనే చెప్పారు!''

నాకీసారి సరైన సమాధానం దొరికింది!

-కొట్టి రామారావు
(మచిలీపట్నం)